క్లుప్తంగా

పార్టీ బలోపేతమే లక్ష్యం

సీతానగరం: మండలంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జోగింపేటలో పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఖాళీలు భర్తీ చేయాలి

పార్వతీపురంటౌన్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో గతంలో పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యేల సిఫార్సుతో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అటువంటి ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

కోతకు సిద్ధం


బుడ్డిపేట వద్ద పండిన వరిచేను

సీతానగరం: ఖరీఫ్ వరిపంట కోతదశకు చేరుకుంది. పంటకోతలకు రైతులు సిద్ధమయ్యారు. అయితే తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పంటకోతలు వాయిదా వేయాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో కోతలు వాయిదా వేశారు. మండలంలో నిడగల్లు, సుమిత్రాపురం, వెంకటాపురం, నీలకంఠాపురం, పెదంకలాం, బుడ్డిపేట, లక్ష్మీపురం, చినబోగిలి తదితర గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో వరిపంట కోతకు చేరుకుంది. పంటను కోసేందుకు రైతులు కూలీలను పెట్టుకున్నారు. ఈలోగా తుఫాను హెచ్చరికలు రావడంతో కోతలు వాయిదా వేశారు. అయితే మరికొద్ది రోజులు కోతలు వాయిదా వేస్తే వరివెన్నులు పొలంలో రాలిపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రహదారి సమస్య పరిష్కరించరూ..

సీతంపేట: మండలంలోని లాడ - కోసంగి రహదారి అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి కూడా నరక యాతన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సైతం వారపు సంతలకు తీసుకెళ్లలేకపోతున్నామని గ్రామానికి చెందిన సవర సన్నాయి. శంకరరావు, తదితరులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మినీ జాబ్‌మేళా రేపు

పాలకొండ రూరల్: స్థానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలతో పాటు జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 - 25 సంవత్సరాల మధ్య వయసుండి, పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హతల గలవారు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 70930 28546 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి హైస్కూల్‌లో బిగ్‌టీవీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లా, రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో చేపట్టిన ఈ శిబిరానికి హాజరైన 250 మందికి పైగా రోగులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, కిరణ్‌రెడ్డి, ధర్మ, కుసుమిత, ఏరియా మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు..

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఇసుక పాలసీ కఠినంగా అమలు చేయాలని ఆదేశిస్తుంటే.. కొందరు అక్రమార్కులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రమైన పాలకొండకు అతి సమీపంలోగల నాగావళి నదీ తీరం నుంచి నిత్యం వందల ట్రాక్టర్లతో ఇష్టానుసారం ఇసుక తరలిపోతోందన్నారు. నదిలో ఉన్న వంతెన పిల్లర్ల వద్ద, తాగునీటి వనరుల వద్ద తవ్వకాలు చేపడుతుండడంతో వంతెనకు ప్రమాదం పొంచి ఉందన్నారు. కొంతమంది స్వార్థం వల్ల ప్రజలందరికీ ఇబ్బందులు తప్పవని, అధికారులు వెంటనే స్పందించి అక్రమ రవాణాపై దృష్టి సారించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

భామిని: ఇంటింట కుళాయి, తాగునీటి పథకాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అలికాన సందీప్ అన్నారు. మండలంలోని లోహరిజోల, బిల్లుమడ, నేరడి-బి, గురండిలో జరుగుతున్న వాటర్ ట్యాంక్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కో ఆర్డినేటర్ తిరుమల, సైట్ ఇంజినీర్లు ఉన్నారు.

పని ఎక్కువ.. వారు తక్కువ


పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు

- పట్టణంలో పూర్తిస్థాయిలో లేని పారిశుద్ధ్య సిబ్బంది
- కార్మికుల కొరతతో ఉన్నవారిపై పనిభారం
- పలు వార్డుల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- కాలం చెల్లిన వాహనాలతో చెత్తసేకరణ
- జీవో 279 ప్రకారం కార్మికులను నియమించాలని వినతులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బందిపై పనిభారం పెరగడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పట్టణ జనాభాతో పాటు విస్తీర్ణం కూడా పెరిగింది. శివారు ప్రాంతాల్లో కొత్త కాలనీలు వెలశాయి. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికులు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ చెత్తపోగులు వెలస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెరిగిన జనాభాకు తగ్గట్టు పట్టణంలో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

ఉన్నవారిపై పనిభారం రెట్టింపు

కొత్తగా జిల్లా ఏర్పడటం, జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు కూడా వచ్చాయి. ప్రతిరోజు జిల్లా అధికారుల పర్యటనలు, రాజకీయ నాయకుల సమావేశాలు తదితర వాటికి ఉన్న సిబ్బందినే వినియోగించడం వల్ల వార్డుల్లో పారిశుద్ధ్య పనులు అటకెక్కుతున్నాయి. మున్సిపాలిటీలో మెయిన్ రోడ్డుతో పాటు గుడ్స్‌షెడ్ రోడ్డు, చర్చ్ వీధి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయం, పాత బస్టాండు, కొత్తవలస, జిల్లా ఆస్పత్రి రోడ్లు తదితర ప్రాంతాలలో 24/7 పారిశుద్ధ్య సేవలు నిర్వహించాల్సి ఉంది. రోజుకు మూడుసార్లు స్వీపింగ్, బ్రెస్సింగ్, లిఫ్టింగ్ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంది. దీంతో పట్టణంలో ఇప్పటికే పనిచేస్తున్న కార్మికులపై పనిభారం రెట్టింపయ్యింది.

జీఓ 279 ప్రకారం అదనపు సిబ్బంది నియామకం

పార్వతీపురం పట్టణంలో ప్రతిరోజూ సుమారు 25 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పన్నమవుతుంది. దాన్ని సేకరించడంతో పాటు డంపింగ్ యార్డుకు తరలించేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టమవుతోంది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 122 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. జీఓ నంబరు 279 ప్రకారం మరో 65 మంది కార్మికులు అదనంగా అవసరం ఉందని 2018లో అప్పటి అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పార్వతీపురం జిల్లా కేంద్రంగా మారింది. పట్టణ ప్రజల అవసరాల మేరకు మరింతమంది కార్మికులను నియమించాల్సి ఉంది.

కాలం చెల్లిన వాహనాలు

మున్సిపాలిటీలో చెత్తను తరలించేందుకు ప్రస్తుతం ఐదు ట్రాక్టర్లు ఉన్నాయి. వాటికి కాలం చెల్లడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిస్థానంలో కొత్త వాహనాలను సమకూర్చడంతో పాటు అవసరానికి తగ్గట్టు అదనపు వాహనాలను కొనుగోలు చేయాలి.

సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి



పారిశుద్ధ్య సేవలు అందించేందుకు సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి. జీఓ నంబర్ 279 ప్రకారం సిబ్బంది నియామకానికి అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలి.

– గొర్లి వెంకటరావు, సీఐటీయూ నాయకుడు

వాకర్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పసుపతినాథ్ కళ్యాణ మండపంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ట్ క్లబ్ 20వ వార్షికోత్సవ సమావేశం క్లబ్ గవర్నర్ జామి నారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రెసిడెంట్ టి.మురళీమోహనరావు, 2025 ఏడాది అధ్యక్షులు ఎం.ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్ ఏరియా–1 అభిమన్యు నాయక్, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రతినిధులు, క్లబ్ మెంబర్లు, పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపడుతూ క్లబ్‌కు మంచిపేరు తీసుకురావాలని కోరారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన పలువురు సభ్యులను ఈ సందర్భంగా సత్కరించారు.


మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ 2025 అధ్యక్షురాలు ప్రభావతి

అనుమతులు తప్పనిసరి

గరుగుబిల్లి: దీపావళి పండగ నేపథ్యంలో టపాసులు విక్రయించే వారంతా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఈ నెల 31వ తేదీన దీపావళి కావడంతో బాణసంచా విక్రయాలు జోరందుకుంటున్నాయని, ఎవరైతే టపాసులు విక్రయించాలనుకుంటున్నారో వారు రెవెన్యూ శాఖ నుంచి గానీ పోలీస్ శాఖ నుంచి గానీ అనుమతులు తీసుకోవాలని సూచించారు.

ఎక్కడైనా అక్రమంగా మందుగుండు సామగ్రి విక్రయించినా తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

104 ఉద్యోగులను ఆదుకోవాలి

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా 104 సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.ఆనందరావు, ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడుతూ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 104 సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఏటా వేతనాలు పెంచాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


పార్వతీపురంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న యమ్మల మన్మథరావు

సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యమ్మల మన్మథరావు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం 104 ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ.. 104 వాహనాలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ 44, 59 ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, డిమాండ్ చేశారు. డీఈఓ లకు వెయిటేజ్ మార్కులు కల్పించాలని, ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంక్రిమెంట్ చెల్లించాలని, సెల్ బిల్లులు, విహనాల మెంటెనెన్స్, టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. కార్యక్ర మంలో 104 ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామినాయుడు, కాశీ, జగదీష్, సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష


పాలకొండ రూరల్: మందుగుండు కొనుగోలులో నిమగ్నమైన ప్రజలు

- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అజాగ్రత్తగా ఉంటే పెనుప్రమాదం
- ఈ నెల 31న దీపావళి
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం/పాలకొండ రూరల్: చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు అందరికీ ఎంతో ఇష్టమైన పండగ దీపావళి. ఈ దీపోత్సవం రోజున అందరికీ బాగా గుర్తొచ్చేవి టపాసులు. అయితే వాటిని కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా పెనుప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఏటా ఈ పండగ రోజున పాటించాల్సిన జాగ్రత్తలు కొత్త కాకపోయినా మరోసారి గుర్తు చేసుకుంటే చాలా మంచిదని చెబుతున్నారు. ముఖ్యంగా క్రాకర్స్(టపాసులు) కాల్చేందుకు చిన్నారులు ఎంతో మక్కువ కనబరుస్తారని, వారి విషయంలో తస్మాత్ జాగ్రత్త అని అంటున్నారు. ఈ నెల 31వ తేదీన దీపావళి నేపథ్యంలో జాగ్రత్తలు గుర్చి ప్రత్యేక కథనం..

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు ఉండే ప్రదేశాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటి టపాసులు కాల్చరాదు.


పాలకొండ రూరల్: మతాబీలు కాల్చుతున్న చిన్నారులు (ఫైల్)

- టపాసుల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులంతా క్రాకర్స్ కాల్చాలి.
- ఇరుకైన ప్రదేశాలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే చోట టపాసులు పేల్చరాదు.
- బాణసంచా కాల్చేవారు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.

వ్యాపారులు పాటించాల్సినవి..

- జనసంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని, టపాసుల అమ్మకాలు చేయాలి.
- టపాసులు విక్రయించే వారంతా అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- క్రాకర్స్ విక్రయ ప్రదేశంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన ఫైర్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ కలిగి ఉండాలి.
- టపాసులు అమ్మే చోట ఇసుక, నీరు, కార్బన్‌డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలి.
- క్రాకర్స్ దుకాణాల వద్ద సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చరాదని తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి.
- మందుగుండు సామగ్రి విక్రయ కేంద్రాల వద్ద విద్యుత్ వైరింగ్ సరిగా ఉండేలా చూడాలి.
- ప్రతీ షాపు వద్ద టపాసుల ధరల పట్టిక, అగ్నిమాపక కార్యాలయం ఫోన్ నంబర్లు ఉండాలి.

అజాగ్రత్త తగదు



మందుగుండా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం తప్పదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, గడ్డివాములు ఉండేవాళ్లు ముందుగా వాటిని నీటితో తడపటం, నీటిని సేకరించిసమీపంలో ఉంచుకోవడంమేలు. అలాగే మందుగుండు అమ్మేవారు కూడా సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదాలు జరిగితే 100 లేదా 08941 260111 నంబర్‌కు సమాచారం తక్షణమే అందించాలి.

– జామి సర్వేశ్వరరావు, అగ్నిమాపక అధికారి, పాలకొండ

అనుమతులు తప్పనిసరి..



మందుగుండు అమ్మకందారులు కచ్చితంగా నిర్దేశిత అనుమతులు పొందాలి. అక్రమంగా మందుగుండు కలిగి ఉన్నా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవు. ముఖ్యంగా గ్రామాల్లో అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసుల సహకారం పొందేందుకు 08941 260133 నంబర్‌కు సమాచారం అందించాలి.

– కె.ప్రయోగమూర్తి, ఎస్సై పాలకొండ

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు...

దీపావళి రోజున పార్యవరణాన్ని పరిరక్షించేందుకు అన్నివర్గాల ప్రజలు చైతన్యం కావాలి. టపాసులు ఎంత తక్కువ వినియోగిస్తే వాతావరణ కాలుష్యం అంత తగ్గుతుంది. దీపావళి అంటేనే వెలుగుల పండగ. అందుకే ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు దీపాలు వెలిగించుకుని పండుగ జరుపుకోవాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

గిరిజన సమస్యలపై మంత్రికి వినతి

సాలూరు: గిరిజన సమస్యలను పరిష్కరించాలని గిరిజన జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్, కొండగొర్రి ఉదయ్‌కుమార్, మజ్జి నారాయణ, చెల్లూరు సీతారాం, జట్లు బంగార్రాజు, తదితరులు కోరారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ–3కి చట్టభద్రత కల్పించాలని, గిరిజన యువత కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ఎర్రసామంతవలస గిరిజనులకు ఇళ్ల స్థలాలు, భూసమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. పార్వతీపురం మండలం బడేదేవరకొండపై గ్రానైట్ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని కోరారు. అలాగే పార్వతీపురం ఐటీడీఏ డీడీగా మాతృ సంస్థకు చెందిన రెగ్యులర్ అధికారిని నియమించాలని, ఐటీడీఏలో వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులు

ఉపాధి నిధులతో మొక్కల సంరక్షణ

సీతానగరం: గిరిజన రైతులకు పంపిణీ చేసిన పోడు భూముల్లో ఉపాధి నిధులతో నాటిన మొక్కలను లబ్ధిదారులు సంరక్షించడం ద్వారా వాటిపై వచ్చే ఫలసాయాన్ని పొందవచ్చని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని తామరఖండి, బక్కుపేట గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారుల భూముల్లో నాటిన మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులున్న పేదగిరిజన కుటుంబాలకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పోడుభూములు పంపిణీ చేసిందన్నారు. ఆయా భూముల్లో టేకు, జీడి, మామిడి మొక్కలు నాటి వాటిని సంరక్షించడం జరిగిందన్నారు. వాటి నుంచి వస్తున్న ఫలసాయాన్ని లబ్ధిదారులు అనుభవిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుచ్చిమి, చిన్నారాయుడుపేట, సీతారాంపురం గ్రామాల లబ్ధిదారులకు పంపిణీ చేసిన భూముల్లో ఫలసాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.


బక్కుపేటలో తోటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరికి మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, కారుణ్య నియామకాలు, సాధారణ, ప్రమాద మరణాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపులు, కార్మికులు దీర్ఘకాలం పోరాడి సాధించుకున్న వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవ్‌లు, జాతీయ సెలవులు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కార్మికులపై రోజురోజుకు పనిభారం పెరుగుతోందని, దొడ్డిదారిన అధికారులు, ప్రజాప్రతినిధులు వారి ఇళ్లల్లో పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంకుర సూరిబాబు, ఎస్.శంకరరావు, ఎస్.మల్లేశ్వరరావు, ఎం.శివ, సీహెచ్ సింహాచలం, విజయ, లక్ష్మణరావు, ఆర్.తిరుపతిరావు, ఇ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పాల ధరలు తగ్గించడంతో పాడిరైతులకు అన్యాయం

- ఏపీ పాల రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్

పార్వతీపురంటౌన్: పాల ధరను తగ్గించడం వల్ల రైతులు నష్టపోతున్నారని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ పాల రైతుల సంఘం(ఏపీ రైతు సంఘం అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 29న గాజువాకలో నిర్వహించే మహాధర్నాకు సబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ డెయిరీలో విక్రయిస్తున్న ఆవుపాలపై రూ.3–4లు వరకు ధర తగ్గించడం వల్ల పాడిరైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికే పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాలధర తగ్గింపుతో నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వ, విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయంతో భవిష్యత్తులో పాలు కల్తీతో పాటు, పసిపిల్లలు, మహిళలు, వృద్ధుల్లో పౌష్టికాహార లోపాలు ఎదురవుతాయని తెలిపారు. విశాఖ డెయిరీలో అధికారం మొత్తం కొంతమంది వ్యక్తులు చేజిక్కించుకొని తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, డెయిరీ లాభాలను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 29న గాజువాక వద్ద ఉన్న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. పాడిరైతులు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని పాల రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, పాలపై తగ్గించిన ధరను వెంటనే పెంచి రైతులకు లబ్ధి చేకూర్చాలని, డెయిరీని సొసైటీ చట్టం పరిధిలోకి తీసుకురావాలని, ప్రతి రెండు నెలలకోసారి బోనస్‌లు ఇవ్వాలని, రైతులకు నష్టం కలిగించే ఖర్చులను డెయిరీనే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు బంటు దాసు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏపీ పాల రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్

అంతర పంటలతో అధిక లాభాలు


రైతులతో అగర్‌వుడ్ సంస్థ సీఈఓ ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బలిజిపేట: అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని అగర్‌వుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో ప్రసాద్ సంపంగి అన్నారు. పణుకువలస గ్రామంలో బి.సింహాచలంకు చెందిన పామాయిల్ తోటలో అంతరపంటగా అగర్‌వుడ్ మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరపంటల సాగుపై, అగర్‌వుడ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడటం వల్ల నష్టపోతున్నారన్నారు. దీర్ఘకాలిక పంటలైన పామ్‌ఆయిల్, కొబ్బరి, జీడిమామిడి తోటలలో నీడ ప్రదేశంలో పెరిగే అంతరపంటలను వేసుకోవడం వలన మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. వాటిలో అగర్‌వుడ్ పంటను సాగుచేస్తూ, తీగజాతి పంటలైన తమలపాకులు, మిరియాలు, పిప్పళ్ల వంటివాటిని సాగుచేసుకోవచ్చని తెలిపారు. అదేవిదంగా పసుపు, అల్లం, చేమ వంటి దుంపజాతి పంటలను వేసుకోవచ్చని సూచించారు. వాటిని ఏవిధంగా సాగుచేయాలో వివరించారు. రైతులతో కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం కింద సంస్థ అగ్రిమెంట్ చేసుకుంటుందన్నారు. అగర్‌వుడ్ సాగు వివరాల కోసం 9390503685, నేచురల్ ఫార్మింగ్ కోసం 9652971235, 8297438875 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ కాసులు సూచించారు. మండలంలోని సుభద్రమ్మవలస గ్రామ రోడ్డులో చినమేరంగి పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలు పరిశీలించి, అవేమీ లేని వారికి అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని తెలిపారు. అలాగే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.